సాక్షి నిజామాబాద్

సోమవారం • 8 • జూలై • 2024



జీవితంలో యోగా భాగమవ్వాలి

ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో యోగా భాగం కావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు.

- 9లో ▸

మహిళలకు మీ సేవ కేంద్రాలు

మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.9 /24.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అగ్నివీర్ వాయులో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: అగ్నివీర్ వాయులో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఇంటర్మీడియట్ లేదా అందుకు సామానమైన విద్యనభ్యసించి ఉండాలన్నారు. 2004 జూలై 31వ తేదీ నుంచి 2008 జనవరి 03వ తేదీ మధ్య జన్మించి.. వివాహం కాని యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జూలై 8వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలతో పాటు దరఖాస్తు కోసం http://agnipathvayu.cdac.inను సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌కు క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో అండర్ – 23 పురుష, మహిళల రెజ్లింగ్ సెలక్షన్స్‌ను ఆదివారం నిర్వహించారు. జిల్లా మ్యాట్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు కొనసాగాయి. గెలుపొందిన క్రీడాకారులను ఈనెల 14న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జిల్లా నుంచి పంపించనున్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భక్తవత్సలం, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్ సుబేదార్, జైపాల్ హాజరై క్రీడాకారులను అభినందించారు. సెక్రెటరీ దేవేందర్, సురేశ్, సుజాత, కామారెడ్డి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, సభ్యుడు దానయ్య ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

ఎంపికైన క్రీడాకారులు..

57కేజీల విభాగం: మలావత్ మనోహర్, **60 కేజీలు:** ఆర్ అమర్‌సింగ్, **70 కేజీలు:** బి గోపాల్, **55 కేజీలు :** శ్రీకాంత్, **57కేజీలు :** సురేందర్, **65కేజీలు :** సోఫియాన్

మహిళల విభాగం **72 కేజీలు :** హిమబిందు, **76 కేజీలు :** నేహ.

అందరికీ సంక్షేమఫలాలు అందిస్తాం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ధర్పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించి, అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మండల కేంద్రంలో జగన్నాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రథయాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నదని, రైతుల అభిప్రాయం మేరకు రైతులకు రైతు భరోసా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టులో అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలులో పైరవీలకు తావు లేదని, అర్హులకే పథకాలు అందుతాయని తెలిపారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజు, సొసైటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, నాయకులు చెలిమెల నర్సయ్య, మనోహర్‌రెడ్డి, గంగారెడ్డి, రాములు, భగవాన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.



జై జగన్నాథ్..

ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న నగరంలో రథయాత్ర

- శ్రీ నీలకంఠేశ్వరాలయం నుంచి వినాయక్‌నగర్ వరకు శోభాయాత్ర
- జిల్లాలోని వివిధ మండలాల నుంచి తరలిరానున్న భక్తులు
- జగన్నాథునికి 56 రకాల నైవేద్యాలు నివేదించనున్న ఇస్కాన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ క్షేత్రంలో జగన్నాథ, బలదేవ్, సుభద్రమయ, సుదర్శన చక్ర రథయాత్ర అంటేనే ఎనలేని ప్రపంచ ప్రఖ్యాతి కలిగింది. పూరి జగన్నాథ స్వామి పేరు చెబితేనే భక్తులు అనిర్వచనీయమైన అనుభూతిని పొందుతారు. ఒడిశాలోని పూరి క్షేత్రంలో ఆదివారం రథయాత్ర నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఆషాఢం ప్రారంభంలో నిర్వహించే ఈ జగన్నాథ స్వామి రథయాత్రకు ఉన్న ఖ్యాతి, ప్రాముఖ్యత ఎనలేనిది. పూరీలో జగన్నాథ రథయాత్ర పూర్తయిన తొమ్మిది రోజుల లోపు ప్రపంచవ్యాప్తంగా అన్ని చోట్ల జగన్నాథ రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక ఇస్కాన్ (అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం) ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలు కోట్లాది మందిని కృష్ణతత్వం, ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపిస్తున్నాయి. కాగా ఇందూరు నగరంలో ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో ఈ నెల 12న జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రకు జిల్లాలోని వివిధ మండలాల నుంచి భక్తులు తరలిరానున్నారు. కంఠేశ్వర్ ఇస్కాన్ విభాగం ఆధ్వర్యంలో 2022 నుంచి ఈ రథయాత్ర వేడుక ను వైభవంగా నిర్వహిస్తున్నారు. రథయాత్ర మధ్యాహ్నం 1 గంటకు నగరంలోని శ్రీ నీలకంఠేశ్వరాలయం వద్ద మొదలు కానుంది. అక్కడి నుంచి రైల్వే కమాన్, శ్రీగణేశ్ చౌరస్తా (మున్సిపల్ కార్యాలయం), రైల్వే స్టేషన్, తిలక్ గార్డెన్స్, బస్‌స్టేషన్, మెడికల్ కళాశాల, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, పెద్ద బజార్, శివాజీనగర్ చౌరస్తా (ఆర్‌ఆర్ చౌరస్తా), పులాంగ్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగనుంది. చివరకు వినాయక్‌నగర్‌లోని విజయలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఇందులో భాగంగా భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, మహాహారతి, మహాప్రసాద వితరణ చేయనున్నారు. అలాగే జగన్నాథ స్వామివారికి 56 రకాల నైవేద్యాలు నివేదించనున్నారు.

వైభవంగా రథయాత్ర..



జగన్నాథ రథయాత్ర ఉత్సవాన్ని నిర్వహించడాన్ని 2022లో ప్రారంభించాం. ఈ మహాక్రతువు ప్రతి ఏటా నిర్వహించనున్నాం. ఇప్పటికే నగరంలో ప్రతిరోజూ పూజలు చేస్తున్నాం. ప్రతి ఆదివారం ఇస్కాన్ కేంద్రంలో కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నాం. అదేవిధంగా ప్రతి ఆదివారం భజనలు, కీర్తనలు, భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిరాటంకంగా చేపడుతున్నాం. ఇస్కాన్ కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు ముందుకెళుతున్నాం. రథయాత్రకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి జగన్నాథుని కృపకు పాత్రులు కావాలి. ఇక త్వరలో స్థల సేకరణ పూర్తి చేసి ఇందూరులో శోభాయమానమైన ఇస్కాన్ ఆలయాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

– రామానందరాయ్ గౌరదాస్, ఇందూరు ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు

సగానికి తగ్గిన సోయా

- దిగుబడి భయంతో సాగుకు ముందుకురాని రైతులు
- ప్రస్తుత ఖరీఫ్‌లో 52 శాతమే సాగు
- సోయా స్థానంలో మొక్కజొన్న వేసిన రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): గతేడాది ఎదురైన చేదు అనుభవంతో జిల్లా రైతులు సోయా పంటకు దూరంగా ఉన్నారు. అధిక వర్షాలకు తోడు తెగుళ్లు ఆశించడంతో ఈ ఏడాది సాగు చేయడానికి పెద్దగా ముందుకు రాలేదు. దిగుబడి రావడం లేదనే భయంతో సోయా సాగును సగానికి తగ్గించారు. నాలుగు ఎకరాలు వేసే రైతులు రెండు ఎకరాల్లో కూడా పంటను వేయలేదు. కొందరైతే సోయా జోలికి కూడా వెళ్లలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, ఇతర పంటల వైపు మళ్లారు. గతేడాది ఖరీఫ్‌లో సోయా 51,579 ఎకరాల్లో సాగవగా, ఈ ఏడాది 51,478 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ, అంచనాలు తలకిందులయ్యాయి. కేవలం 32,374 ఎకరాల్లో (52శాతం) మాత్రమే రైతులు సాగు చేశారు. వర్షాలు సరిగ్గా లేకపోవడంతో పంట సక్రమంగా మొలకెత్తడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది కూడా దిగుబడి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడు అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి నాలుగైదు ఎకరాలకే పరిమితమైంది.

పెరిగిన మక్క సాగు

సోయా సాగు చేసే రైతులు మొక్కజొన్న వైపు మళ్లారు. సోయాతో పోలిస్తే మక్క ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని గట్టెక్కుతుంది. మార్కెట్‌లో కూడా పంటకు మంచి ధర వస్తోంది. ఇటీవల పెంచిన మద్దతు ధరతో మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,225కు చేరింది. దీంతో సోయాను సాగు చేసి నష్టాల పాలయ్యే కంటే మక్కను సాగు చేయాలని రైతులు నిర్ణయించుకున్నారు. అయితే మొక్కజొన్న గతేడాది 42,043 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది 41,714 ఎకరాలు సాగవుతుందని అంచనా ఉంటే 40,714 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఎకరానికి 30–35 క్వింటాళ్ల దిగుబడి రానుంది. లోకల్ మక్కతో పాటు విత్తన మక్కను కూడా సాగు చేస్తున్నారు. విత్తన మక్కను సాగు చేసి అనుకున్న దిగుబడి వస్తే వ్యాపారులు ఎకరానికి రూ. 50వేల నుంచి రూ. 60వేల వరకు రైతులకు చెల్లించనున్నారు.

సోయా తగ్గించి మక్క వేశా



పోయినసారి సోయాకు ఎదురైన ఇబ్బందులను చూసి ఈ ఏడాది సోయా సాగును ఎకరంన్నరకు పరిమితం చేశాను. సోయా స్థానంలో మొక్కజొన్న పంటను నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నా. సీడ్ మక్కకు డిమాండ్ ఉండడంతో కొంతమంది రైతులం కలిసి వ్యాపారులతో ముందస్తు ఒప్పందం చేసుకున్నాం.

– గడ్డం చిన్నారెడ్డి, రైతు, నూత్‌పల్లి



నూత్‌పల్లిలో పెరుగుతున్న సోయా

నిరాశాజనకంగా ఎస్సారెస్పీ



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిమట్టం

- ఎగువ నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టులోకి 2,300 క్యూసెక్కుల వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం నిరాశజనకంగా ఉంది. జూలై మాసంలో మొదటివారం గడుస్తున్నా ఎగువ నుంచి అనుకున్నంత వరద నీరు రావడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీకి ఎగువన మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ గేట్లను జూలై 1న ఎత్తివేశారు. దీంతో ప్రస్తుత సంవత్సరం అత్యధికంగా 4,900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. తర్వాత క్రమంగా తగ్గుముఖం పడుతూ శుక్రవారానికి 2,300 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోయింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం పెరగడం లేదు. ఎగువ గోదావరి పరివాహక ప్రాంతాల్లో కూడా లోటు వర్షపాతం ఉండడంతో ఇప్పట్లో వరదలు వచ్చే అవకాశం లేదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1061.20 అడుగుల(11.7 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

కనీసం 56 టీఎంసీల నీరు..

ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీటి సరఫరా చేపట్టాలంటే ప్రాజెక్టులో కనీసం 56 టీఎంసీల నీరు నిల్వ ఉండాలి. ప్రస్తుతం ప్రాజెక్టులో 11.7 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. మరో 45 టీఎంసీల వరదనీరు వచ్చిచేరితే తప్పా ఆయకట్టుకు భరోసా లభించదు. తాగునీటి అవసరాలు, నీటి ఆవిరి లెక్కలు, డెడ్ స్టోరేజ్ లెక్కలు పోనూ 36 నుంచి 40 టీఎంసీల నీటి అవసరం ఖరీఫ్‌లో ఆయకట్టుకు ఉంటుందని రికార్డులు తెలుపుతున్నాయి. ఈ నెలాఖరు వరకైనా వరదలు వస్తే ఖరీఫ్ నీటి విడుదలపై ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంటుంది. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితులు కనిపించకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్టులో 16.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

జూనియర్లే విచారణాధికారులు

- విద్యాశాఖ తీరుపై ప్రధానోపాధ్యాయుల గుస్సా
- చర్చనీయాంశంగా పలు ఘటనలు

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో విచారణ కోసం సీనియర్లపై జూనియర్ అధికారులు వెళ్లడం చర్చనీయంగా మారింది. ఇటీవల జరిగిన కొన్ని విచారణలలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు చెందిన వారు పీజీహెచ్‌ఎం ప్రధానోపాధ్యాయులపై విచారణ అధికారులుగా వెళ్లారు. ఈ వ్యవహారంపై పీజీహెచ్‌ఎంలు మండిపడుతున్నారు. తమకంటే తక్కువ స్థాయి ఉన్నవారు విచారణ అధికారిగా రావడం మమ్మల్ని ఇబ్బందులకు గురిచేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఇటీవల ధర్పల్లి హైస్కూల్లో జరిగిన వివాదంలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు చెందిన అధికారి వెళ్లి పీజీహెచ్‌ఎంలను విచారించారు. గతంలో డైయిట్ కళాశాలలో అధికారిపై కొందరు విద్యార్థి సంఘం నాయకులు ఫిర్యాదులు చేశారు. జిల్లా స్థాయి అధికారి హోదా కలిగిన అతనిపై కిందిస్థాయి ఉద్యోగులు వెళ్లి విచారణ చేశారు.



- వేల్పూర్ మండలంలోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంపై అవినీతి ఆరోపణలు రావడంతో స్కూల్ అసిస్టెంట్ విభాగం అధికారి విచారణ చేపట్టారు. ఇక్కడ ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను కాకుండా ఇతర అంశాలతో సంబంధిత ప్రధాన ఉపాధ్యాయుడిని వేధింపులకు కూడా గురి చేశారని సదరు వ్యక్తి ప్రధానోపాధ్యాయుల సంఘానికి ఫిర్యాదు చేశాడు.
- రెంజల్ మోడల్ స్కూల్లో జరిగిన ఘటనపై జూనియర్ అధికారి విచారణ చేపట్టారు. అలాగే ఆర్మూర్‌లోని మధ్యాహ్న భోజనం విషయంలో జూనియర్ అధికారి హెచ్‌ఎంపై విచారణ చేశారు.

విచారణకు వెళ్తే విందులే..

విచారణకు వెళ్లే అధికారులు కొన్ని ప్రాంతాలలో విందు కార్యక్రమాలు ఏర్పాటు చేయించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆర్మూర్ ప్రాంతంలో విచారణకు వెళ్లిన అధికారికి ఓ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో విందు కార్యక్రమాలు చేశారు. నవీపేట మండలంలో మధ్యాహ్న భోజనం పై వచ్చిన ఫిర్యాదును పరిశీలించేందుకు వెళ్లిన అధికారులు సదరు ఏజెన్సీ నిర్వాహకుడితో విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

పైస్థాయి వారిని నియమించాలి

పీజీహెచ్‌ఎంలు ప్రధానోపాధ్యాయుల విషయంలో ఏమైనా వివాదం, ఫిర్యాదులు వచ్చినప్పుడు వారి కంటే ఎక్కువ స్థాయి హోదా కలిగిన వారిని విచారణ అధికారిగా నియమించాలి. కాని తక్కువ స్థాయి వారిని నియమించడం సబాబు కాదు. దీనిపై విద్యాశాఖ దృష్టి సారించాలి లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– రాజ్ గంగారెడ్డి, తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విజిట్‌పై వెళ్తే వర్క్ లేదంతే!

- మాల్టా, పోలాండ్, పోర్చుగల్ దేశాలలో మారిన వీసా నిబంధనలు

మోర్తాడ్(బాల్కొండ): మాల్టా, పోలాండ్, పోర్చుగల్ దేశాలు వీసాల జారీలో నిబంధనలను కఠినతరం చేశాయి. విజిట్ వీసాలపై వెళ్లి వర్క్ వీసా సంపాదించుకుంటామనే ధీమాతో ఉన్న వలస కార్మికుల ఆశలపై ఆయా ప్రభుత్వాలు నీళ్లు చల్లాయి. ఈ దేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉండడంతో చాలా మంది విజిట్ వీసాలపై వెళ్లి అక్కడే ఉండిపోతున్నారు. కొందరు చట్ట విరుద్ధంగా పనులు చేసుకుంటుండగా.. మరికొందరు ఎలాగోలా వర్క్ వీసాలను పొందారు. తమ దేశంలో చట్ట విరుద్ధంగా ఉండిపోతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని గుర్తించిన ఆయా దేశాల ప్రభుత్వాలు.. పది రోజుల క్రితం విజిట్ వీసాల జారీ నిబంధనలను కఠినతరం చేశాయి. ఇక నుంచి ఎవరైనా విజిట్ వీసాపై వచ్చి వర్క్ వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే అలాంటి వారిని వెంటనే అరెస్టు చేసేలా ఉత్తర్వులను జారీ చేశాయి. వలస కార్మికులు వర్క్ వీసాలపైనే రావాలని అక్కడి ప్రభుత్వాలు స్పష్టం చేస్తున్నాయి. మాల్టాలో ఉపాధి కల్పిస్తామని పలువురు ఏజెంట్లు తెలంగాణకు చెందిన చాలా మంది వలస కార్మికులను నిండా ముంచిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. మూడు దేశాలు వీసాల జారీ విషయంలో కొత్త నిబంధనలు తెచ్చిన నేపథ్యంలో ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల స్పందించారు. కార్మికులు వర్క్ వీసాలపై మాత్రమే రావాలని సూచించారు. ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

రైతు భరోసా ఎవరికో!

- పెట్టుబడి సాయంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ
- జిల్లాలో రైతులతో ముగిసిన సమావేశాలు
- ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన అధికారులు

మోర్తాడ్: పంటల సాగుకు పెట్టుబడి అందించే రైతు భరోసా పథకం అమలులో చేయాల్సిన మార్పులు–చేర్పులకు సంబంధించి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తయింది. విధివిధానాలను ఖరారు చేయడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం, శాసనసభలో చర్చ అనంతరం నిర్ణయం తీసుకోనుంది. దీంతో ఈ వర్షాకాల సీజన్ పంటలకు పెట్టుబడి సాయం అందడంలో మరింత సమయం పట్టే అవకాశం ఉంది. జిల్లాలోని 89 సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి రైతు భరోసా ఎన్ని ఎకరాలకు వర్తింప చేయాలి.. అర్హుల ఎంపిక ఎలా సాగాలి.. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారికి రైతు భరోసాను వర్తింపజేయాలా వద్దా అనే అంశాలపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. కౌలు రైతులకు రైతు భరోసా అందించాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో కౌలు రైతులను ఎలా గుర్తించాలి.. ఒక వేల ఎవరైనా భూములను కౌలుకు ఇచ్చి వారే భరోసా అందుకుంటే కౌలు రైతుల పరిస్థితి ఏమిటనే విషయాలపై చర్చించాల్సి ఉన్నా కేవలం ఎన్ని ఎకరాలు అనే ప్రధాన అంశంపై చర్చ జరిగింది. కొంత మంది రైతులు ఐదెకరాలు, మరి కొందరు పదెకరాల వరకు అని వెల్లడించారు. దీంతో రైతులు తెలిపిన అభిప్రాయాలను అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే వెంటనే రైతుల ఖాతాల్లో భరోసా సొమ్ము జమ కానుంది. అసెంబ్లీలో చర్చ తర్వాతే మార్గదర్శకాల జారీ అంటే పెట్టుబడి సాయానికి కొంత సమయం పట్టనుంది. అలాగే ఎకరానికి రూ.7,500 చొప్పున సాయం అందిస్తారా అనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలో ఎకరానికి రూ.5వేల సాయం అందేది. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ ఒక కొలిక్కి వచ్చినా ప్రభుత్వ నిర్ణయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.



తాళ్లరాంపూర్‌లో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

క్లుప్తంగా

ఆగస్టు 20న జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 20న జిల్లాస్థాయి డ్యాన్స్, కల్చరల్, వెస్టర్న్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌బాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంజలి సిస్టర్స్ డ్యాన్స్ అకాడమీలో అసోసియేషన్ వార్షిక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆగస్టు 20న జిల్లా స్థాయి కల్చరల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జానపదం, శాస్త్రీయ నృత్యాలు, వెస్టర్న్ డ్యాన్స్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి తోట ప్రశాంత్, కోశాధికారి నవనీత, సలహాదారులు పసునూరి వినయ్ కుమార్, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, సంయుక్త కార్యదర్శులు మనాలిని, గీతాంజలి, అమృత్, రఘు, శ్రీకాంత్, సోనూ, చందు, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

డీఈపై విచారణతో ఉద్యోగుల్లో వణుకు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖ ఆర్మూర్ డివిజన్ డీఈ హరిచంద్‌నాయక్‌పై విచారణ జరగడంతో ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. డివిజన్ అభివృద్ధికి ఏడీఈ, ఏఈలు, కాంట్రాక్టర్ల నుంచి తన వద్ద తనకు అనుకూలంగా ఉండే ఉద్యోగుల ఖాతాల్లోకి అతను ప్రతినెలా డబ్బులు పంపించడం ఆనవాయితీగా మారింది. ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తన అనుచర ఉద్యోగుల ఖాతాల్లోకి పంపించుకొని, తిరిగి తన ఖాతాలోకి బదిలీ చేయిస్తున్నట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్ రెడ్డి విచారణలో సైతం ఏడీఈ, ఏఈలు డివిజన్ అభివృద్ధికి డబ్బులు ఇచ్చామని చెప్పినట్లు సమాచారం. అసలు డివిజన్ అభివృద్ధి, మరమ్మతులు చేయాలంటే కచ్చితంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో నిధులు తెప్పించుకోవచ్చు. కానీ డబ్బులు తీసుకొని అభివృద్ధి చేయడంపై పలు అనుమానాలకు తావస్తోంది. ఏడాదిన్నర గడవక ముందే డీఈపై మళ్లీ విచారణ జరగడంపై ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని డీఈ అనుచర ఉద్యోగులు భయపడుతున్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరిగితే అక్రమాలు బయట పడతాయని పలువురు పేర్కొంటున్నారు.

వెలవెలబోతున్న ప్యాసింజర్ ఆటోలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించడంతో ఆటోలు వెలవెలబోతున్నాయి. గ్రామాల్లో 90 శాతం మహిళలు ఆటోలు ఎక్కడం మానేశారు. వారితో పాటు పురుషులు కూడా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. దీంతో ఆటోలు నిండక, ఎక్కే వారు లేక ఆటో డ్రైవర్లు ఈగలు తోలుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజుకు కనీసం రూ.1,000 సంపాదించే ఆటో డ్రైవర్లకు ఇప్పుడు రూ.200 కూడా రావడం లేదు. దీంతో డ్రైవర్లకు బతుకు భారమైంది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

అంగన్‌వాడీ సిబ్బందిలో ఆందోళన

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని టీచర్లు, సిబ్బంది ధర్నా
- ప్రభుత్వం స్పందించాలని డిమాండ్



జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న ఆయాలు, టీచర్లు

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్లుగా పనిచేస్తున్న వారికి 65 ఏళ్లు నిండితే తప్పనిసరిగా పదవీ విరమణ చేయాల్సిందేనని, విధుల్లో కొనసాగడానికి వీలు లేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు నిండిన టీచర్లు, హెల్పర్లను గుర్తించాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు జిల్లా అధికారులకు గత నెల 29న మెమో జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో 40 మంది టీచర్లు, 228 సిబ్బంది ఉన్నట్లు గుర్తించి వారిని విధులకు హాజరు కావొద్దని చెప్పడంతో వారు షాక్‌కు గురయ్యారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆందోళనకు గురవుతున్నారు. పదవీ విరమణ అనంతరం తమకు కల్పించే బెనిఫిట్స్ మొత్తాన్ని పెంచకుండానే హుటాహుటిన తొలగింపు నిర్ణయం తీసుకోవడంతో వాళ్లు హతాశులయ్యారు. ఏళ్ల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చాలీచాలని వేతనాలతో సేవలు అందించిన తమకు గౌరవప్రదంగానైనా పదవీ విరమణ చేసే అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ అనంతరం ఇచ్చే బెనిఫిట్స్ పెంచే విషయాన్ని తేల్చకుండానే పక్కన బెట్టాలనే ప్రభుత్వ చర్యను నిరసిస్తూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పదవీ విరమణ పొందిన పలువురు టీచర్లు, హెల్పర్లు ధర్నా చేపడుతున్నారు.

జిల్లాలో 1500 అంగన్‌వాడీలు..

జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్‌రూరల్, భీమ్‌గల్ సీడీపీవో కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. వీరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు, గృహిణులకు సేవలు అందిస్తున్నారు. 65 ఏళ్లు నిండిన వారు పదవీ విరమణ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయాలు సుమారు 288 మంది, టీచర్స్–94 రిటైర్‌మెంట్ అయ్యారు. టీచర్స్ రూ.1లక్ష, ఆయాలకు రూ. 50వేల చొప్పున ఇవ్వాలని గతంలో ఇచ్చిన జీవో ప్రకారం ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైటర్డ్ అయిన ప్రాంతాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణలేదు. స్వచ్ఛందంగా వారు పదవీ విరమణ చేస్తే తప్ప పోస్టులు ఖాళీ ఏర్పడేవి కావు. ఈ కేంద్రాల్లో ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించాల్సి ఉంటుంది. బాలింతలు, గర్భిణులకు సైతం పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

ఇవేగాకుండా ఇతరత్రా విధులను కూడా అంగన్‌వాడీ టీచర్లకు అప్పగిస్తుంటారు. వీరి పదవీ విరమణకు సంబంధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పదవీ విరమణ వయస్సును నిర్ధారించాయి. రాష్ట్రంలో 65 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని గత ఏడాది సెప్టెంబర్ 5న గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. అప్పటి వరకు పదవీ విరమణ అనంతరం టీచర్లకు రూ. 60 వేలు, హెల్పర్లకు రూ. 30 వేలు బెనిఫిట్స్ అందేవి.

నెరవేరని హామీలు..

గత ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రూ. లక్ష, హెల్పర్లకు రూ. 50 వేలు పెంచుతూ జీవోలో పేర్కొంది. ఈ జీవో వెలువడిన అనంతరం ఇతర సమస్యలతో పాటు పదవీ విరమణ పొందిన టీచర్లకు రూ. 2 లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష బెనిఫిట్స్ ఇవ్వాలని గతంలో 24 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. దీంతో నాటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు బెనిఫిట్స్‌ను పెంచుతామని హామీ ఇవ్వడంతో అక్టోబర్ 4న సమ్మెను విరమించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో హామీ నెరవేరలేదు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి వచ్చింది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం కొత్త ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 7న ఐసీడీఎస్ డైరెక్టరేట్ కార్యాలయ ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు. కానీ వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కనీసం బెనిఫిట్స్ పెంచాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీల కుటుంబాలను ఆదుకోవాలి

నిజామాబాద్‌నాగారం/ ఖలీల్‌వాడి: అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా లోని ధర్నాచౌక్ వద్ద రెండో రోజులుగా అంగన్‌వాడీ ఆయాలు నిరసనలు తెలిపారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి స్వర్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవోతో 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లను వారి విధుల నుంచి తొలిగించడం సరైనదికాదన్నారు. అనంతరం ఆయాల నేత సరస్వతీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక మంది చిన్న పిల్లలకు సేవలు చేసి విద్యాబుద్ధులు నేర్పిన తమను పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. బెన్‌ఫిట్స్‌ను పెంచాలని డిమాండ్ చేశారు.

బెనిఫిట్స్ పెంచాలి



పదవీ విరమణ చేసే ఆయాలకు కచ్చితంగా బెనిఫిట్స్ పెంచాలి. గత ప్రభుత్వం రూ. 50వేలు ఇస్తామని చెప్పింది. ప్రస్తుత ప్రభుత్వం రూ. లక్ష పెంచి ఇవ్వాలి. అలాగే పింఛన్ రూపంలో జీతంలో సగం పింఛన్‌ను ప్రతి నెలా ఇవ్వాలి. – సరస్వతి, ఆయమ్మ

న్యాయం చేయాలి



పిల్లలకు దశాబ్దాలుగా అన్ని రకాల సేవలు చేసిన తమ కుటుంబానికి న్యాయం చేయాలి. ఏళ్ల తరబడి పని చేసినందుకు ప్రభుత్వం ఆదుకోకపోతే మా కుటుంబాలు రోడ్డున పడుతాయి. ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి. – కళావతి, ఆయమ్మ

పోరాటం చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోతో 65 ఏళ్ల నిండిన అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు పదవీ విరమణ చేస్తున్నారు. టీచర్స్‌కు రూ. 2లక్షలు, ఆయాలకు రూ. 1 లక్ష ఇవ్వాలి. పెన్షన్లు అందించాలి. న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు పోరాటాలు చేస్తాం.

– స్వర్ణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి

మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రాలు

- జిల్లాలో 37 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు
- ప్రారంభించనున్న జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ

మోర్తాడ్(బాల్కొండ): మహిళా సాధికారతే ప్రధాన ఎజెండాగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రాల నిర్వహణకు కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో 37 గ్రామాల్లో మీ సేవ కేంద్రాలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టులో ప్రారంభించడానికి జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులు సన్నాహాలు చేస్తున్నారు. ఇది ప్రయోగాత్మకంగా అని వారు చెబుతున్నారు. మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేసే మహిళా సంఘానికి ప్రత్యేకంగా రూ. 2.50 లక్షల రుణం అందించనున్నారు. కంప్యూటర్లు, ప్రింటర్, జిరాక్స్ మిషన్ ఇతర సామాగ్రి, స్టేషనరీ కొనుగోలు కోసం ఈ రుణం ఉపయోగించనున్నారు. మీ సేవ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఇంటర్ చదివిన మహిళను ఎంపిక చేయనున్నారు. పూర్తిగా మహిళల భాగస్వామ్యంతోనే కేంద్రాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని డీపీఎం శ్రీనివాస్ 'సాక్షి'తో తెలిపారు. కేంద్రాలను మహిళలు నిర్వహించడం వల్ల సంఘాలకు ఆర్థిక తోడ్పాటు ఉంటుందని సెర్ప్ అధికారులు భావిస్తున్నారు.

పళని సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం గుర్తింపు



పళని సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయంలో తెలంగాణ చరిత్ర బృంద సభ్యుడు మంచాల శ్రీకాంత్ అరుదైన పళని సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని ఆదివారం గుర్తించారు. ఈ విగ్రహం రాష్టంలో లభించడం ఇదే మొదటిసారి కావచ్చని అభిప్రాయపడ్డారు. ఈ విగ్రహం ఎత్తు 8సెంటీమీటర్ల వెడల్పు 3 సెంటీమీటర్ల పొడవు, తలపై రుద్రాక్షమాల ధరించి, కుడి చేతిలో నిలువెత్తు దండాయుదాపాణి పట్టుకొని, మెడలో హారం, చేతికి దండ కడియాలు, కేవలం కౌపినం మాత్రమే ధరించి ఉందన్నారు. ఈ విగ్రహం ఇక్కడికి ఎలా వచ్చిందో.. ఏ కాలంలో ప్రతిష్ఠించారో? సరైయిన ఆధారాలు లేవన్నారు. ప్రస్తుతం సాయిబాబా ఆలయంలోని రావిచెట్టు కింద నుంచి తీసి ఆలయ ఆవరణలోని సురక్షితమైన ప్రదేశంలో పునఃప్రతిష్ఠించారు. శిల్పం పూర్తి వివరాలు తెలిసేలా ఒక నోటీస్ బోర్డు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు.

బౌద్ధక్షేత్రం చరిత్రను తెలుసుకోవాలి



బౌద్ధక్షేత్రం వద్ద విద్యార్థులతో ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి

- నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలో అతిపెద్దదైన ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి బౌద్ధక్షేత్రం చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నిజామాబాద్ ఎక్సైజ్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ ఎస్ సోమిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కుటుంబసమేతంగా బౌద్ధక్షేత్రాన్ని సందర్శించారు. బౌద్ధక్షేత్ర చరిత్రను లిఖించిన బోర్డులను పరిశీలించారు. అదే సమయంలో సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు విజ్ఞానయాత్రకు రాగా, వారితో కలిసి ఆట, పాటలతో సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బుద్ధుడు అహింసా మార్గాన్ని ఎంచుకున్నారని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. సిద్ధార్థ యోగా విద్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, పీఈటీలు సౌజన్య, ఉదయ్, పాఠశాల వసతి గృహం అధికారి నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



రాచూర్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను తప్పకుండా అమలు చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. రాచూర్, డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామాలలో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాచూర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరి నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. గ్రామంలో సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

నిజాంసాగర్(జుక్కల్): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తమ వంతు కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి అర్జీలను స్వీకరించారు. గృహలక్ష్మి, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పట్టా పాసు బుక్కుల సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్హత ఉన్న వారందరికి ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఆర్ఎం, డీఎం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేట ఆర్టీసీ బస్టాండ్‌ను ఆదివారం నిజామాబాద్ డిప్యూటీ ఆర్ఎం సరస్వతి పరిశీలించారు. బస్టాండ్ స్థలానికి సంబంధించిన వివరాలను బాన్సువాడ డిపో మేనేజర్ సరితను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బస్టాండ్ స్థలం ఎంతవరకు పోతుందోనని పరిశీలించినట్లు ఆమె చెప్పారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న తమ స్థలంలో దుకాణాల ఏర్పాటు కోసం టెండర్లను ఆహ్వానిస్తామని పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



బోధన్‌లో వంశి స్కూల్ పూర్వ విద్యార్థులు



ఫత్తేపూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న మాణిక్‌భవన్ పాఠశాల పూర్వ విద్యార్థులు

సుభాష్‌నగర్/ నిజామాబాద్‌నాగారం: నగరంలోని శ్రీ నూతన వైశ్య ఉన్నత పాఠశాల(మాణిక్‌భవన్)లో 1996–97కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థులు ఒకేచోట కలవడంతో ఒకరి సంతోషం వ్యక్తం చేస్తూ ఒకరి యోగ క్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంశి స్కూల్‌లో..

బోధన్‌టౌన్: పట్టణంలోని రవి గార్డెన్‌లో వంశి స్కూల్‌కు చెందిన 2000–01 పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం చేపట్టారు. మిత్రులందరూ ఒకేచోట చేరడంతో నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ఫత్తేపూర్‌లో..

పెర్కిట్: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సమ్మేళనంలో ఉత్సాహంగా గడిపారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉడుము 'పట్టు' పడుతున్నారు..!



బాల్కొండ: ప్రస్తుత వాతావరణ మార్పులతో ఉడుములు బయటకు వచ్చి సంచరిస్తున్నాయి. మండలంలోని బోదేపల్లి శివారులో ఉన్న లిఫ్టు కాలువలో ఉడుములు బయటకు వస్తుండడంతో వాటిని స్థానిక యువకులు పట్టుకుంటున్నారు. కిలో ఉడుమును రూ. 600కు విక్రయిస్తున్నారు. వీటిని తినే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఉడుములు నడుం నొప్పులకు బాగా ఉపయోగపడతాయని ప్రజలు సైతం వీటిని ఆ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

నిజాంసాగర్: మండలంలోని ఒడ్డేపల్లి శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఘటనకు సంబంధించి సీఐ సత్యనారాయణ, ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట మండలం జాప్తి జాన్కంపల్లికి చెందిన లకావత్ దేవీచంద్ లకావత్ సునీత(35) దంపతులతో పాటు బంధువైన శ్రీనివాస్‌తో కలిసి పిట్లం మండలం వడ్లం గ్రామానికి బైక్‌పై వెళ్లారు. సాయంత్రం వీరు స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఒడ్డేపల్లి శివారులోని ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో సునీత అక్కడికక్కడే మృతి చెందగా దేవిచంద్, శ్రీనివాస్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



చిన్న గంగారాం(ఫైల్)

గాంధారి: ఆటో నుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం ఉదయం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతాయిపల్లి గ్రామానికి చెందిన నీరడి చిన్న గంగారాం (40) ఆరు నెలల క్రితం బతుకు దెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ ఓ భవనం వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో నుంచి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రిలో చేయించారు. చికిత్స పొందుతున్న గంగారాం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ఆర్మూర్‌టౌన్: పట్టణ శివారులోని పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. అమ్మవారి విగ్రహంపై ఉన్న ఆరు మాసాల బంగారం, ఐదు తులాల పట్టగొలుసులు, అమ్మవారి వెండి కండ్లు చోరీకి గురైనట్లు ఆలయ పూజరులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఐదుసార్లు ఆలయంలో దొంగలు పడ్డారని పూజారులు పేర్కొన్నారు. పోలీసులు రాత్రి వేళల్లో నిఘా పెంచాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో అసిస్టెంట్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు



గాయపడ్డ రంగ్యానాయక్

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో ఐబీ పెట్రోల్ బంక్ ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా అసిస్టెంట్‌లైన్‌మన్ రంగ్యానాయక్ విద్యుత్‌షాక్‌తో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే ఈ ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో సదరు కాంట్రాక్టర్ ఇటీవల విద్యుత్‌వైర్లు వేయించాడు. నాసిరకంగా పనులు చేపట్టడంతో వైర్లు వదులుగా ఉన్నాయి. సంబంధిత ఏఈ పర్యవేక్షణ లోపంతో అసిస్టెంట్ లైన్‌మన్‌కు షాక్ తగిలిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. మరమ్మతు కోసం విద్యుత్ స్తంభం ఎక్కిన రంగ్యానాయక్‌కు గాలుల వల్ల వైర్లు తగలడంతో కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. ఈ విషయమై ఇన్‌చార్జి ఏఈ భాస్కర్‌ను వివరణ కోరగా పనుల విషయం తెలియదని, మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురయ్యాడని తెలిసి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

రుద్రూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైనట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నరేశ్(31) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచార మేరకు చెరువులో మృతదేహం ఉందని సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో నరేశ్ మృతదేహంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.